క్లుప్తంగా

'రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం'

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం చేశారని అరకొర నిధులు కేటాయించి చిన్నచూపు చూశారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తాలుకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ ఓ ప్రకటనలో విమర్శించారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 2 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకొంటున్నాయని, నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పాటునివ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామ పంచాయతీలోని టైరోడ్డులో ఉన్న 12వ వార్డులో మంగళవారం గ్రామ సర్పంచ్ మహదేవమ్మ 450 మీటర్ల సీసీ రోడ్డు పనులను, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ గ్రామ పంచాయతీలోని ప్రతి వీధిలో కూడా సైడ్ డ్రెయిన్ నిర్మాణంతో పాటూ సీసీ రోడ్డు నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తిమ్మురాజ్, మెకానిక్ ఆంజనేయులు, రామకృష్ణ, వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్



మాగనూర్: విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వర్కూర్ క్రాస్ రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కోసం ఏర్పాటు చేసిన 33/1 కేవీ హైవోల్టేజ్ విద్యుత్ తీగల స్తంభంను గుర్తు తెలియని టిప్పర్ ఢీకొంది. కాగా రాత్రి సమయం, జనసంచారం తక్కువగా ఉండడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభంతో పాటుగా ప్రధానమైన కల్వర్టు కూడా పూర్తిగా ధ్వంసమైంది. గ్రామంలోని ప్రధానకాలనీలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ఘనంగా శివపూజ



మరికల్: మండల కేంద్రంలో శివ భక్తులు మంగళవారం ఘనంగా పాత శివాలయంలో పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంతకుముందు కలశ ఊరేగింపు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మరికల్: గ్రామ పంచాయతీ సిబ్బంది ఏళ్లుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. పంచాయితీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వారి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలను చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయితీ సిబ్బంది సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామన్నారు. రామాజీ, బాలప్ప, మొగులప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు వినతి

నారాయణపేట టౌన్ : ఉమ్మడి జిల్లా టీయూడబ్ల్యూజేహెచ్ ద్వితీయ మహాసభను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జర్నలిస్టులు తరలివెళ్లారు. జిల్లా పరిధిలో అక్రిడేషన్ కార్డు ఉన్న 243 మందిలో ఇది వరకే ఇళ్ల స్థలాలు తీసుకున్న వారిని మినహాయించి, మిగిలిన వారందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు కె.ఆనంద్ కుమార్ గౌడ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు వారథీ నవీన్ కుమార్, రఘు, శ్రీను, రాజశేఖర్, అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.



నూతన భవనాలు మంజూరయ్యేనా?

- అద్దె భవనాలు, అంగన్‌వాడీల్లో కొనసాగుతున్న నూతన పంచాయతీలు
- పట్టించుకోని అధికారులు



లక్ష్మిపల్లిలో అద్దెభవనంలో..



ఏర్గాట్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

ఊట్కూర్: నియోజకవర్గంలోని నూతన పంచాయతీలకు పక్కాభవనాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఊట్కూర్ మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రభుత్వం మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పరచాలన్న లక్ష్యంతో నూతన పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా 5 పంచాయతీలను ఏర్పాటు చేశారు. ఏర్గాట్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, లక్ష్మిపల్లి, తిమ్మారెడ్డిపల్లి తాండ, సమస్తాపూర్ గ్రామాలను పంచాయతీలుగా వీటిలో ఉన్నాయి. వీటిని ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు దాటింది. అయినా ఇప్పటికీ ఆయా గ్రామాల పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరికొన్ని పాఠశాలల అదనపు గదుల్లో నిర్వహిస్తున్నారు. దీంతో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాలు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో ఇలా..

☛ ఎర్గాట్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు.

☛ లక్ష్మిపల్లి పంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. భవనం చిన్నదిగా ఉండడంతో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

☛ నాగిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనంలో పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడే తరగతులను నిర్వహిస్తున్నారు.

☛ తిమ్మారెడ్డిపల్లి తాండలో పాఠశాల భవనం అదనపు గదిలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సమావేశాలు ఆరుబయట చెట్ల కింద నిర్వహిస్తున్నారు.

☛ సమస్తాపూర్ గ్రామంలో అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది.

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో 5 నూతన గ్రామ పంచాయతీలకు పక్కా భవనాల మంజూరుకోసం ప్రతిపాదనలు పంపించాం. ఒక్కో పంచాయతీ భవనానికి రూ. 16 లక్షల నిధులు అవసరం అవుతాయని ప్రతిపాదనలలో పేర్కొన్నాం. అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం.

–జగత్ చంద్ర, ఏఈ (పీఆర్), ఊట్కూర్ మండలం

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల గ్రామానికి చెందిన ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బాల్‌రాజు తన సొంత ట్రాక్టర్‌లో ఇసుకను ఊట్కూరుకు అక్రమంగా తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది రామాంజనేయులు, గోపాల్‌లు ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారని వివరించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

ఇసుక టిప్పర్లు..

మద్దూరు: ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళలో ఇసుకను టిప్పర్లలో లింగల్‌వాగు నుంచి తరలిస్తుండగా టాక్స్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్ మండలంలోని లింగల్‌చేడ్ వాగు నుంచి దుప్పట్‌గట్ గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, పల్లెర్ల గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి టిప్పర్లు ఇసుకను అక్రమంగా తరలింస్తుండగా పట్టుకున్నామని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

నర్వ: విద్యార్థినులు పాఠశాలలో వేధింపులకు గురవుతుంటే వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని షీటీమ్స్ ఎస్‌ఐ సుధామాధురి అన్నారు. మంగళవారం ఉందేకోడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని, సెల్‌ఫోన్ వినియోగం పూర్తిగా తగ్గించాలన్నారు. సెల్‌ఫోన్‌ల వినియోగం వల్ల విద్యార్థులు చెడుమార్గం వైపు వెళ్లే అవకాశం ఉందన్నారు. హెచ్‌ఎం కోట్ల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, షీటీమ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన పీఈటీలు



నారాయణపేట టౌన్ : నారాయపేట జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావును కలిశారు. బదిలీలు, పదోన్నతులలో వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిగౌడ్, జిల్లా నాయకులు కతలప్ప, బాలరాజ్, రామకృష్ణారెడ్డి, పాలమూర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన



లింగంపల్లిలో జీపీ బిల్డింగ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : పల్లె, పట్నం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి బీఆర్‌ఎస్ కృషిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతోనే సుపరిపాలన సాధ్యపడుతోందన్నారు. మండలంలోని లింగంపల్లి, పిల్లిగుండ్లతండా, పేరపళ్ల, మీదితండాలకు మంజూరైన నూతన పంచాయతీ భవన నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేస్తున్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ పాటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయో ప్రజలకు చెప్పాలని, తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాల్లో ఏ ఒక్కటైనా అమలు చేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని, దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుల, మత, పార్టీలకు అతీతంగా అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే నియోజకవర్గంలోని ప్రతీ పల్లెకు బీటీ రోడ్డు మంజూరయ్యిందని, శిథిలావస్థల్లో ఉన్న భవనాల స్థానంలో నూతనంగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించామన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక పంచాయతీలు చేయడంతో పాటు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. యువతకు మెడికల్, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలు, అప్పక్‌పల్లి – కోయిలకొండ రహదారి డబుల్‌రోడ్డు, జిల్లా గిరిజనులకు సేవాలాల్ భవనం, అప్పక్‌పల్లి దగ్గర రూరల్ పోలీస్ స్టేషన్ తీసుకుని వచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ అంజలి, మండల అధ్యక్షులు వేపూరిరాములు, ఆయా గ్రామ సర్పంచ్‌లు బాలప్ప, శ్రీదేవి, రాజారాం రాథోడ్, రవీందర్, జగన్నాథ్, రాజు, రామ్మోహన్, సాయిరెడ్డి, రాములు పాల్గొన్నారు.

అధికారుల అండతోనే అక్రమ రవాణా

కృష్ణా: మండలంలోని కృష్ణానదిలో ప్రస్తుతం నీళ్ల తగ్గడంతో ఇసుకను తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ముడుమాల్, మురహర్‌దొడ్డి, హిందుపూర్, కృష్ణా, తంగిడి గ్రామాల్లోని ట్రాక్టర్ల యజమానులు ప్రతి నిత్యం రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని వినవస్తోంది. విషయంలో కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారని, దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారని పలువురు అంటున్నారు. ఇందుకోసం అక్రమార్కుల నుంచి అధికారులకు మామూళ్లు అందుతున్నాయని ఆయాగ్రామాల ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ విషయంపై మాట్లాడినవారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నారాయణపేట రూరల్ : ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి సమక్షంలో 19వ వార్డు కౌన్సిలర్ సరితతో పాటు ఆమె భర్త, అడ్వకేట్ సతీష్‌గౌడ్‌లు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మరో 20మంది వార్డు ప్రజలు సైతం పార్టీలో చేరారు. మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ, పట్టణ అధ్యక్షులు విజయ్‌సాగర్, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీ ముట్టడి

కోస్గి: సమస్యల పరిష్కారం కోరుతూ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సిములు ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో యాదవ సోదరులు ముట్టడికి తరలి రావాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు మోహన్, రమేష్, వెంకటేష్, రాములు, అంజి ఉన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి



మద్దూరులో ధర్నా చేపట్టిన నాయకులు

మద్దూరు: మండలంలోని నందిపాడ్ గ్రామంలో శివ మాలధారులు దళితులపై దాడి చేశారని, నిందితులను వెంటనే రిమాండ్ చేయాలని కోరుతూ మంగళవారం మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఘటనా స్థలానికి చేరుకొని ఎస్‌ఐ సతీష్ దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్, కేవీపీఎస్, డీబీఎస్‌యూ, సీఐటీయూ, ఎమ్మార్పీఎస్ ఇతర దళిత సంఘాల నాయకులు గోపాల్, చిన్నయ్య, హన్మంతు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గంధం ఊరేగింపు



నారాయణపేట టౌన్ : మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలో మంగళవారం మదర్ సాబ్ గంధం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఖాసిం సాహెబ్ ఆధ్వర్యంలో మసీద్ నుంచి చెరువు కట్టపై కొలువైన మదర్‌సాబ్ దర్గా వరకు గంధం ఊరేగింపు సాగింది. అనంతరం దర్గాపై దట్టీలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జెండాకట్టల ధ్వంసం సరికాదు



నారాయణపేట టౌన్ : అధికారం అడ్డుపెట్టుకొని కొందరు బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలో కొంత కాలం నుంచి టీడీపీ జెండా కట్టలను ధ్వంసం చేస్తున్నారని పార్టీ నాయకులు వినయ్‌మిత్రయాదవ్ ఆరోపించారు. పట్టణంలోని 20, 21 వార్డులలో జెండా కట్టలను ధ్వంసం చేశారన్నారు. గతంలో కోటకొండ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేశారని గుర్తుకు చేశారు. అంతకుముందు ధ్వంసం చేసిన జెండాకట్టలను పరిశీలించారు. వాటిని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాఘవరావు చౌద్రి, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, ఓంప్రకాశ్, మనోహర్, శివ కుమార్, వీరన్న, రమేష్, శ్రీకాంత్, బస్సయ్యస్వామి కార్యకర్తలు ఉన్నా రు.

విద్యారంగ అభివృద్ధిని విస్మరించారు



నారాయణపేట టౌన్ : విద్యారంగ అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందని, బడ్జెట్‌లో అన్యాయం చేశారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో మంగళవారం రాష్ట్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, గతంలో విద్యారంగ అభివృద్ధికి పాటు పడతామంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మారుతి, నాయకులు కృష్ణ, నరసింహ, మహేష్, ఆంజనేయులు, కార్తీక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊర లక్ష్మమ్మ జాతర





ఊట్కూరులో బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

ఊట్కూరు: ఊరలక్ష్మమ్మ జాతరను ఊట్కూరులో మంగళవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం నలుమూలల నుంచి మహిళలు బోనాలతో ఊరేగుతూ కోళ్లతో, గొర్రెపోతులతో మొక్కుబడులు తీర్చుకున్నారు. సర్దార్ నగర్ నుంచి బోయిని అమ్మన్న పెద్ద బోనం కుండ తలపై పెట్టుకుని మేళతాళాలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆనవాయితీగా తెల్లవారుజామున ప్రత్యేక వంటకాలతో డప్పు వాయిద్యాలతో గ్రామం చుట్టూ పొలి చల్లారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ హనుమంతు, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కుంటిమారి లక్ష్మన్న, సత్యనారాయణ, రఘువీర్ తదితరులు మొక్కుబడులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా చిరు వ్యాపారులు మిఠాయి, గాజుల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ రాములు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పశుమిత్రలకు కనీసవేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట టౌన్ : పశు మిత్రలకు ఐకేపీ ద్వారా శిక్షణ ఇచ్చి పనిలో పెట్టుకున్న ప్రభుత్వం, వేతనాలు ఇవ్వడంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా వెట్టి చాకిరి చేయించుకోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కన్వీనర్ బాల్‌రాం, అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పశుమిత్రలు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు, మేకలు, గొర్రెలు, కోళ్లు తదితర వాటికి వ్యాక్సినేషన్ ఇవ్వడం, కృత్రిమ గర్భాలను చేయించడం తదితర అనేక పనులు పశుమిత్రలు చేస్తున్నారని అన్నారు. కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పశుమిత్రల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 22న ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పశుమిత్రల వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా సమ్రీన్, ప్రధాన కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా భువనేశ్వరి, జిల్లా సభ్యులుగా మౌనిక, మంజుల, అమృతమ్మ, కూర్మమ్మ, రోజా, సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశసేవ చేయడం అదృష్టం

మక్తల్: ఆర్మీలో ఎంపికై దేశసేవ చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుర్లపల్లికి చెందిన రాము యాదవ్ ఆర్మీకి ఎంపికవ్వడంతో ఎమ్మెల్యే చిట్టెం తన నివాసంలో ఆయనను శాలువాతో సన్మానించారు. సైనికుడిగా గొప్పగా సేవలందించి ప్రాంతానికి గొప్ప పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'పేదలకు అండగా ఉంటాం'



మక్తల్: పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనుగొండ గ్రామానికి చెందిన వడ్ల కృష్ణయ్య కుమార్తె జాహ్నవి వివాహానికి రూ.20 వేల నగదుతో పాటు భోజన సదుపాయాలకు అవసరమైన సామగ్రిని అందించారు. వీజేఆర్ ఫౌండేషన్ గ్రామ వలంటీర్ల అభ్యర్థన మేరకు ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ సందర్భంగా వర్కటం జగన్నాథ్‌రెడ్డిని గ్రామస్తులు, జాహ్నవి కుటుంబ సభ్యులు అభినందించారు.

రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

నారాయణపేట రూరల్ : గ్రామీణ ప్రజల ఆరాధ్యదైవమైన ఎల్లమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. లింగంపల్లి రెండవ మంగళవారం జన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ అంజలి, బీఆర్‌ఎస్ అధ్యక్షులు వేపూరిరాములు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్‌ఐ సురేష్‌గౌడ్, జిల్లా కోర్టు పీపీ తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దల కోరిక మేరకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా నిధులు అందించి భక్తులకు షెడ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. స్థలాన్ని సైతం పరిశీలించారు. భద్రత చర్యలపై డీఎస్పీ పోలీసులకు తగు సూచనలు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, భక్తులు తోపులాట లేకుండా సౌకర్యంగా దర్శనం చేసుకునే విధంగా చూడాలన్నారు. పార్కింగ్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.



పేటలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్ వీధిలో కొలువైన రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ మంగళవారం సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, పసుపు, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మద్దూరు: మండలంలోని మేడికుంట తండాలోని మహిళతో కొంత కాలంగా అదే తండాకు చెందిన సంతోష్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మంగళవారం గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో మహిళ కుటుంబ సభ్యులు సంతోష్ కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న అతడి కుటుంబ సభ్యులు కూడా పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీస్‌స్టేషన్ ఎదుట కూడా ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. దీంతో సంతోష్ కుటుంబ సభ్యులు 7 గురిపై, మహిళ కుటుంబ సభ్యులు 5 గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.